# -ఎన్. శివానంద్ కథ

చేతిలో డబ్బు లేకపోయేసరికి చిరాకనిపించింది నాకు. 'డబ్బుకోసం ఇప్పుడేదైనా చేయాలి' అనుకుంటుండగానే బస్టాండులో నాకో వ్యక్తి కనిపించాడు. కనిపించడానేకన్నా అతడు నన్ను ఆకర్షించాడంటేనే బాగుంటుంది. అతని చేతిలో ఆకుపచ్చ రంగు హ్యాండు బ్యాగ్ వుంది. ఆ బ్యాగ్ నన్ను మరీ ఆకర్షించింది.

అతడు పల్లెటూరివాడిలా వున్నాడు. బెరుకుగా, భయంభయంగా దిక్కులు చూస్తున్నాడు. అతని వాలకం చూస్తే ఆ బ్యాగ్‌లో డబ్బు తప్పకుండా వుండి వుంటుందనే నమ్మకం కలిగింది నాకు. ఎలాగైనా ఆ బ్యాగ్ కొట్టేయాలనే నిర్ణయానికి వచ్చాను. దొంగతనాలు చేయడం నాకేమీ కొత్తకాదు.

అతడు నావైపు తీక్షణంగా చూసాడు. ఒక్కసారిగా నాలో భయం చోటు చేసుకుంది. నా ప్రయత్నాన్ని ఆ వ్యక్తి పసిగడతాడేమోనని కాస్త భయపడ్డాను. ఇలాంటివి నా వృత్తిలో కొత్తేమీకాదు. ఆ భయం నాలో ఎంతోసేపునిలువలేదు. కొద్దిక్షణాల్లో తేరుకున్నాను.

''ఆదిలాబాద్ బస్సు ఎప్పుడొస్తుంది బాబూ?'' నా దగ్గరికి వచ్చి అడిగాడు ఆ పల్లెటూరి వ్యక్తి.

''మీది ఆదిలాబాదా?'' తిరిగి ప్రశ్నించాను నేను.

''ఆదిలాబాద్ వెళ్లేదారిలో జన్నారం వస్తుంది. అదే మా ఊరు'' చెప్పాడా వ్యక్తి.

జన్నారం అనేసరికి నా మనసెందుకో బాధతో బరువెక్కింది. అది మా స్వంత ఊరు. చిన్నప్పుడు నాన్నతో గొడవపడి వరంగల్‌కు వచ్చి దొంగతనాలు చేసుకుంటూ బతుకుతున్నాను.



''నేనూ ఆ బస్ కోసమే చూస్తున్నాను. మరో పది నిముషాల్లో ఆ బస్ రావచ్చు'' చెప్పాను నేను.

''మీరెక్కడికి వెళ్లాలి బాబూ?''

''ఆదిలాబాద్''

''పదండి. ఒకరికొకరు తోడు'' అన్నాడా వ్యక్తి తోడు దొరికిందనే ధైర్యంతో.

బస్ వచ్చేలోపు అతడు నాతో చాలా విషయాలు చెప్పాడు. తన పేరు రామచంద్రయ్య అని, పనిమీద వరంగల్‌కు వచ్చానని చెప్పాడు.

అంతలో బస్ వచ్చింది. చివరలో సీటు దొరికింది. నేను కిటికీ పక్కనే కూర్చున్నాను. ఏమిటో కిటికీ పక్కన కూర్చోవాలన్న చిన్నతనపు కోరిక నాలో పోలేదు. రామచంద్రయ్య నా పక్కనే కూర్చున్నాడు. నా ఆలోచనంతా అతని బ్యాగ్‌పైనే ఉంది.

వర్షాకాలం కావడంవలన రోడ్డంతా చెడిపోయింది. అసలే ఈ రూట్‌లో రోడ్లు అంతగా బాగోలేవు.

అతని బ్యాగ్‌లో డబ్బు వుందో లేదో? అది నాకు దక్కుతుందో లేదో? టికెట్ డబ్బులు వృధా అవుతాయేమోనన్న అనుమానాలు ఓవైపు నన్ను పీడిస్తున్నాయి.

సన్నగా పడుతున్న చినుకులు చల్లగాలితో కలసి కిటికీలోంచి నామీద పడుతున్నాయి. కిటికీ మూసేద్దామంటే ఆ కిటికీకి అద్దాలులేవు. దబదబ శబ్దంతో బస్సు ప్రయాణం బోర్‌గా వుంది.

రాయపట్నం దాటి నల్లటి గతుకుల రోడ్డుమీద నెమ్మదిగా పరుగుతీస్తోంది బస్సు. రామచంద్రయ్య హాయిగా నిద్రపోతున్నాడు. అతని చేతుల్లోని బ్యాగ్ నెమ్మదిగా నా చేతుల్లోకి తీసుకున్నాను.

అంతే! బస్సు ఒక్కసారిగా దబేల్‌మని శబ్దం చేసింది. గోదావరి మీద కట్టిన రోడ్డు వంతెన కూలిపోయింది. ప్రయాణీకులు ఆర్తనాదాలు చేస్తున్నారు. నా పక్కనే కూర్చున్న రామచంద్రయ్య కెవ్వున కేక వేసాడు. మరుక్షణంలో బస్సు గోదావరిలో పడిపోయింది.

నేను కిటికీలోంచి దూకి ఆయాసంతో ఈదుకుంటూ ఎలాగో ఒడ్డుకు చేరుకోగలిగాను. కొద్ది గాయాలతో బయటపడ్డాను. అంత ప్రమాదంలోను బ్యాగ్‌ను మాత్రం వదిలిపెట్టలేదు నేను. నాలాగే మరికొంతమంది ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని ప్రాణాపాయం నుండి బయటపడగలిగారు.

వెంటనే పోలీసు జీపులు, ఆ తరువాత అంబులెన్సులు ఆ ప్రదేశానికి చేరుకున్నాయి. మమ్మల్నందర్నీ పక్కనేవున్న [illegible] ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.

రామచంద్రయ్యతో పాటు మరికొంతమంది ఈ ప్రమాదంలో మరణించారు.

''బస్సులో మీ బంధువులు ఎవరన్నా వున్నారా? అడిగాడు డాక్టర్ నా బెడ్ వద్దకు వచ్చి.

చనిపోయినవారికి ఎక్స్‌గ్రేషియా కింద కొంత డబ్బు, గాయాలు తగిలిన వారికి కొంత డబ్బు ప్రభుత్వం ఇస్తున్నట్లు ఆసుపత్రిలో ఎవరో అంటుంటే విన్నాను. సడెన్‌గా ఆ మాటలు గుర్తుకు వచ్చాయి నాకు. అప్పుడు నాలో ఓ మెరుపులాంటి ఆలోచన.

''మా బాబాయి వున్నాడు: పేరు రామచంద్రయ్య'' అని చెప్పాను.

''ఎక్కడ నుంచి వస్తున్నారు?''

''వరంగల్ నుండి''

వాళ్ల పరిశీలనలన్నీ అయ్యాక రామచంద్రయ్య చనిపోయినందుకు నాకు గాయాలు తగిలినందుకు పెద్ద మొత్తంలోనే ఎక్స్‌గ్రేషియా ఇచ్చారు నాకు.

''శవాన్ని తీసుకువెళ్లడానికి వ్యాను తెచ్చుకుంటానని చెప్పి నెమ్మదిగా బయటపడ్డాను. పెద్ద మొత్తంలో ఎక్స్‌గ్రేషియా పొందినా బ్యాగ్‌లో ఎంత డబ్బు వుందో చూడాలన్న ఆత్రుత నాలో చావలేదు. సుమారు రెండు వందల రూపాయలు కొంత చిల్లర వున్నాయి. వాటితోపాటు ఓ ఫోటో కనిపించింది. ఆ ఫోటోను పరీక్షగా చూసాను. అంతే నా తలపై ఒక్కసారిగా వెయ్యి పిడుగులు పడ్డట్టనిపించింది. కాళ్ల క్రింద నేల పగిలిపోయి పాతాళంలోకి పడిపోయినట్లనిపించింది. కుప్పకూలిపోయాను.

ఆ ఫోటోలో మా అమ్మానాన్నతోపాటు రామచంద్రయ్య నిలబడి వున్నాడు. అతని పక్కనే నేను. ఆ ఫోటో తీయించుకున్నప్పుడు బహుశా నా వయసు ఆరేళ్లు వుంటుంది.

వయసు మీద పడడంవలన రామచంద్రయ్యను నేను గుర్తించలేదు. ఆయన ఎవరో కాదు. నిజంగా నా స్వంత బాబాయే. చేతిలోని బ్యాగు, ఎక్స్‌గ్రేషియా సొమ్ము వెక్కిరిస్తుంటే నిజంగా వ్యాను కోసం పరుగుతీసాను.

★

# ఎక్స్‌గ్రేషియా